నేడు ఇచ్చోడ, రేపు ఆదిలాబాద్‌లో..

ఎదులాపురం,డిసెంబర్21: క్రిస్మస్ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రాథోడ్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. బోథ్ నియోజకవర్గానికి సంబంధించిన వేడుకలను 22 తేదీన ఉదయం 11.30 గంటలకు ఇచ్చోడ మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో, ఆదిలాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన వేడుకలను 23 తేదీ సాయంత్రం 6 గంటలకు ఎస్టీయూ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రైస్తవులు, పాస్టర్లు, మత పెద్దలు హాజరు కావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ, డిసెంబర్ 21: సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకుల విద్యా సంస్థల్లో 2024-2025 విద్యా సంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఇచ్చోడ ప్రధానాచార్యులు వినోద్ సౌధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.లక్షా 50 వేలు, పట్టణ విద్యార్థుల తల్లిదండ్రులు ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. 2024 ఫిబ్రవరి 11న నిర్వహించే ప్రవేశ పరీక్షకు విద్యార్థులు రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం సమీపంలోని ఏదైనా గురుకుల పాఠశాల, కళాశాలలను సందర్శించి తెలుసుకోవాలని సూచించారు.

దత్తనామ సప్తాహం ప్రారంభం

బజార్‌హత్నూర్, డిసెంబర్ 21: మండలకేంద్రంలోని దత్తాత్రేయ ఆలయంలో నేటి నుంచి ఐదు రోజుల పాటు అఖండ దత్తనామ సప్తాహం ప్రారంభం కానున్నట్లు ఆలయ పూజారి మనోహర్ మహారాజ్ తెలిపారు. గురు చరిత్ర పారాయణం, భగవద్గీత, దత్త జన్మ మహోత్సవం, పల్లకీ ఊరేగింపు భజన కార్యక్రమాలతో పాటు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. భక్తులు మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి దర్శనానికి వస్తారని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

జీతాలు చెల్లించండి మహాప్రభో

ఉట్నూర్, డిసెంబర్ 21: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న తమకు ఆరు నెలల నుంచి జీతాలు రావడం లేదని తెలంగాణ గిరిజన స్కూల్స్, హాస్టల్స్ డైలివేజ్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు బాపురావు, జనరల్ సెక్రెటరీ రాజన్న, నాయకులు రాము, మాణిక్‌రావు, అంజనబాయి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ, పిల్లల ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందిగా మారాయన్నారు. కావున అధికారులు స్పందించి తమ జీతాలు చెల్లించాలని కోరారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 21 : మహాలక్ష్మీ పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం కోసం మహిళలు ప్రభుత్వం ద్వారా జారీ చేసిన ఒరిజినల్ గుర్తింపు కార్డులను చూపించి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన తెలిపారు. గురువారం విలేకరులతో ఆమె మాట్లాడారు. టీఎస్ఆర్టీసీ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం గురువారం నుంచి తప్పనిసరిగా గుర్తింపు కార్డు ఉంటేనే మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు.

సమన్వయకర్తగా స్వామి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 21: సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల సమన్వయకర్తగా నన్నపు స్వామిని నియమించారు. నిర్మల్ జిల్లా ఎన్జీఎఫ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గురువారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన నియామకం పట్ల స్వామిని పలువురు అభినందించారు. అర్లి(టీ) పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

నార్నూర్, డిసెంబర్ 21: మారుమూల గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని అడిషనల్ డీఎంహెచ్‌వో కుమ్ర బాలు తెలిపారు. మండలంలోని ముక్తాపూర్ గ్రామంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్ వైద్య నిపుణులచేతో గిరిజనులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని అడిషనల్ డీఎంహెచ్‌వో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ వైద్యాధికారి రాంబాబు, వైద్యులు హవీలా, వినయ్, రావుఫ్, మేఘన, రాజమణి, మనోజ్, కో ఆర్డినేటర్ మాణిక్‌రావు, సీహెచ్‌వో లక్ష్మి, తులసీదాస్, హెచ్ఈవో శీర్షి, సిబ్బంది చరణ్ దాస్, సత్తవ్వ, అదీప్, ఈశ్వర్, గోకుల్, బాపురావ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

పాఠశాలల్లో వైద్య శిబిరం

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాగర్

ఇచ్చోడ, డిసెంబర్ 21: మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాల, టీటీడబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాలలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ సాగర్ 61 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలన్నారు. హెల్త్ అసిస్టెంట్లు కైలాష్, సుభాష్, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఏహెచ్ఎస్ ప్రిన్సిపాల్ ఉత్తమ్ సింగ్ పాల్గొన్నారు.

నేడు జాతీయ గణిత దినోత్సవం

తాంసి(తలమడుగు), డిసెంబర్ 21: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా తలమడుగు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గణిత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో నారాయణ మాట్లాడుతూ డిసెంబర్ 22న భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామా నుజన్ జయంతిని జాతీయ గణిత దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ఉట్నూర్, డిసెంబర్ 21: విద్యార్థులు యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పావని అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హార్ట్‌ఫుల్ ఎడ్యూకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించడానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. శారీరక ఉల్లాసానికి, రోజంతా విద్యార్థులు ఉత్సాహంగా ఉండడానికి యోగా దోహదం చేస్తుందని చెప్పారు. విద్యార్థులంతా నిత్యం యోగా సాధన చేయాలని సూచించారు. సొసైటీ సభ్యులు ధనుంజయ, సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చేరాల లక్ష్మణ్, అధ్యాపకులు గణేశ్, శ్రీలత, తిరుపతి, రూప, వినోద్, కిషోర్, శ్రీనివాస్‌రావు, సువర్ణ, నవీన్, సుజాత ఉన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

● గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ వెంకటరామిరెడ్డి



మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న వెంకటరామిరెడ్డి

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 21: మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ వెంకటరామిరెడ్డి అన్నారు. మండలంలోని హస్నాపూర్ గ్రామీణ బ్యాంకు ద్వారా 25 సంయం సహాయక మహిళా సంఘాలకు రూ. కోటి చెక్కును గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగడానికి గ్రామీణ బ్యాంకు కృషి చేస్తున్నదని తెలిపారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలతో వ్యాపారాలు చేసుకొని ఎదగాలని సూచించారు. అదేవిధంగా తీసుకున్న రుణాలు వాయిదాల పద్ధతిలో తిరిగి ప్రతి నెల 5వ తేదీలోపు చెల్లిస్తేనే పావలా వడ్డీ వర్తిస్తుందని తెలిపారు. అదే విధంగా రుణాలు సకాలంలో తిరిగి చెల్లిండం వల్ల లోను పూర్తి అయిన తరువాత పెంచి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రైవేట్ బ్యాంకుల వద్ద రుణాలు తీసుకొని మోసపోకూడదని మహిళా సంఘాలకు సూచించారు. గ్రామీణ బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు అందించడం జరుగుతుందని అన్నారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ ఉపేందర్, బ్యాంకు మేనేజర్ రాజేశ్, శ్రీనిధి ఆర్ఎం పూర్ణచందర్, డీఆర్‌డీఏ ఏపీడీ ఏపీడీ చరణ్ దాస్, జాదవ్ శేషారావు, ఐకేపీ ఏపీఎం సూర్యకాంత, సీసీలు రాజేశ్వర్, పద్మారావు, విఠల్‌రావు, అరుణకుమారి, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

'ఇండియా' ఎంపీలపై చర్యలు తీసుకోవాలి

ఇంద్రవెల్లి, డిసెంబర్21: దేశ ఉపరాష్ట్రపతిని అవమానించిన ఇండియా కూటమి ఎంపీల తీరుపై ఇంద్రవెల్లి మండల శాఖ బీజేపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గురువారం మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు బీజేపీ, గిరిజన మోర్చా నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరపరాజు మాట్లాడుతూ. భారత దేశ ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీశ్ ధనకడ్‌ను అవమానించిన తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, జిల్లా స్వచ్ఛ భారత్ కన్వీనర్ దీపక్‌సింగ్ శేకావత్, ఎంపీటీసీ పడ్వాల్ విజయ్‌సింగ్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ముండే రాజేశ్వర్, నాయకులు బండేవార్ సంతోష్, భాలే సునీల్, లాహనే గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

భీంపూర్, డిసెంబర్ 21: ప్రస్తుతం కరోనా కేసులు పెరుగుతున్నందున గ్రామాల్లో వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని భీంపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌రాజ్ సూచించారు. సిబ్బందితో కలిసి గురువారం బేల్సరిరాంపూర్,వడ్గాం, భీంపూర్ తదితర గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరం, తలనొప్పి , జలుబు లక్షణాలు ఉంటే వెంటనే వెల్‌నెస్ సెంటర్లలో, భీంపూర్ పీహెచ్‌సీలో, రిమ్స్‌లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, సుజాత, సరస్వతి, అశోక్‌రెడ్డి, విష్ణు, జనాబాయి తదితరులున్నారు.

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 21: పరిసరాలను శుభ్రంగా ఉంచాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాలలో అటెండర్ లేడని ఉపాధ్యాయులు డీపీవో దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీవో అతుల్ కుమార్, ఇన్‌చార్జి హెచ్ఎం చంద్రకాంత్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, భాస్కర్, మాజీ సర్పంచ్ పెంటన్న పాల్గొన్నారు.

భీంపూర్: పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు

ఎమ్మెల్యేను కలిసిన నేరడిగొండ నాయకులు

నేరడిగొండ, డిసెంబర్ 21: బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయనను అక్కడే కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు రాథోడ్ రాజశేఖర్, రాథోడ్ సురేందర్, నకులుడు, రాథోడ్ పాండు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

తాంసి(తలమడుగు), డిసెంబర్ 21: తలమడుగు మండల కేంద్రంలో గురువారం సామాజిక కార్యకర్త బ్లూ భీమ్ యూత్ అధ్యక్షుడు ప్రేమేందర్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. యూత్ సభ్యులు శేఖర్, ప్రశాంత్, అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేడుకలను విజయవంతం చేయాలి

ఇచ్చోడ, డిసెంబర్ 21: ఈనెల 26వ తేదీ వరకు నిర్వహించే సీపీఐ పార్టీ 99వ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కళ్లెపెల్లి గంగయ్య అన్నారు. మండలకేంద్రంలోని శివాజీ చౌక్‌లో గురువారం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిల్క దేవిదాస్ హాజరై మాట్లాడారు. నాటి నుంచి నేటి వరకు బడుగు బలహీన వర్గాల, పేద ప్రజల, కార్మిక, కర్షకుల కోసం ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. కార్యక్రమంలో గుడిహత్నూర్ మండల కార్యదర్శి షేక్ ఉస్మాన్, సీపీఐ నాయకులు జీ మహేశ్, కే లక్ష్మణ్, లస్మన్న, వెంకటేష్, రాజేందర్, వినోద్, శంకర్, షేక్ అజీమ్ పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం

గాయత్రిని సన్మానిస్తున్న హెచ్ఎం, గ్రామపెద్దలు

ఇచ్చోడ, డిసెంబర్ 21: మండలంలోని బోరిగామ జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఫడ్ గాయత్రి ఇటీవల వనపర్తి, మహబూబ్ నగర్ జిల్లాల్లో నిర్వహించిన అండర్ 17 పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి జట్టుకు ఎంపికైంది. గురువారం గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదిలాబాద్ కింగ్స్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. గాయత్రిని శాలువా, మెమెంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్. గంగాధర్, పీఈటీ రవీందర్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, వినోద్‌కుమార్, రమాకాంత్, రమేశ్, రవీందర్, గ్రామపెద్దలు ప్రభాకర్ రెడ్డి, పోశాలు యాదవ్, స్వామి పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

తాంసి(తలమడుగు), డిసెంబర్ 21 : వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ధనశ్రీ సూచించారు. తలమడుగు మండలంలోని ఖోడద్ గ్రామం వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన పత్రాలు సరిగ్గా లేని వారికి జరిమానా విధించారు. నిబంధనలు పాటించచాలని వాహనదారులకు ఎస్ఐ సూచించారు. పోలీస్ సిబ్బంది అమానుల్లా, ధర్ము, ప్రహ్లాద్, జగన్ సింగ్ ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

● డీఐఈవో రవీంద్రకుమార్

● నేరడిగొండ కళాశాల తనిఖీ

మాట్లాడుతున్న రవీంద్రకుమార్

నేరడిగొండ, డిసెంబర్ 21 : విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఐఈవో రవీంద్ర కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్య అనేది చాలా ముఖ్యమని పేర్కొన్నారు. అత్యుత్తమ ఫలితాలు ఎలా సాధించాలో వివరించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ షబానా తరన్నం, ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు జాదవ్ గణేశ్, ప్రిన్సిపాల్ భగవాన్లు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల తనిఖీ

బోథ్, డిసెంబర్ 21: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం డీఐఈవో రవీంద్రకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో క్షుణ్ణంగా విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని తప్పకుండా పెంచాలని అధ్యాపకులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ బీ శంకర్, కమిటీ సభ్యులు వచ్చిన ఆదిలాబాద్ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవానులు, ఆదిలాబాద్ జిల్లా ప్రిన్సిపాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గణేశ్ జాదవ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జీసీడీవో చాయ

బాలల హక్కుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఉట్నూర్, డిసెంబర్ 21: బాలల హక్కుల రక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జీసీడీవో చాయ అన్నారు. స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం బాలల హక్కులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల రక్షణ భారత రాజ్యాంగంలో పొందుపర్చబడిందన్నారు. హక్కులకు భంగం కలిగితే 1098కి కాల్ చేయాలని సూచిం చారు. బాలలకు సరైన విద్య ఉన్నప్పుడే అభివృద్ధి జరుగుతుందన్నారు. మహిళా సాధికారత సిబ్బంది సరస్వతి, లావణ్య, యశోద, జిల్లా కో ఆర్డినేటర్ మాణిక్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

కాప్రిలో యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ఆలయాలు ముస్తాబు

జైనథ్, డిసెంబర్ 21: భగవద్గీత జయంతి వేడుకలకు మండలంలోని శ్రీకృష్ణ ఆలయాలను భక్తులు ముస్తాబు చేశారు. మండలంలోని కాప్రి, తరోడ(బీ) శ్రీకృష్ణ మందిరాలను గురువారం ముస్తాబు చేశారు. ఈనెల 21, 22, 23వ తేదీల్లో నిర్వహించబోయే వేడుకల్లో కాప్రి శ్రీకృష్ణ ఆలయంలో శ్రీమాన్ పట్టాభి రామాచార్యుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. గీత యజ్ఞం, మహా అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

బోథ్, డిసెంబర్ 21: బజార్‌హత్నూర్ మండలంలోని ఉప్పరపల్లికి చెందిన తొడసం రాహుల్ (21) బోథ్‌లో బుధవారం డిగ్రీ పరీక్ష రాశాడు. అనంతరం తన స్నేహితుడు జుగ్నక్ సంతోష్‌ను తీసుకొని బయటకు వెళ్లాడు. తిరిగి రాత్రి సమయంలో సంతోష్‌ను ఘన్‌పూర్‌లో దిగబెట్టెందుకు వెళ్లాడు. ఈ క్రమంలో నాగుగూడ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో రాహుల్ అక్కడికక్కడే మృతి చెందగా, సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారు. తండ్రి రాజేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

ఒకరి ఆత్మహత్య

ఇచ్చోడ, డిసెంబర్ 21: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన బొనగిరి అడెల్లు (41) మద్యం మత్తులో పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన బొనగిరి అడెల్లు వారం రోజులుగా అతిగా మద్యం తాగి వింతగా ప్రవర్తిస్తున్నాడు. ఈనెల 20వ తేదీన సాయంత్రం మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జీ నరేశ్ తెలిపారు.

పుస్తకాల పంపిణీ

బోథ్, డిసెంబర్ 21: నీటి పారుదల శాఖ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, ఆదిలాబాద్ వాస్తవ్యులు కే భగవంత రావ్ రచించిన 1008 సూక్తులు, ప్రబోధములు పుస్తకం గురువారం మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు కత్తూరి జ్యోతీరమేశ్, రాయిపెల్లి మధుకర్, ఎలుక రాజు, ఓటస్కర్ శేఖర్, పడిగెల విజయ్‌కుమార్, రాయిపెల్లి సంతోష్ పాల్గొన్నారు.

సవరించాలని వినతి

ఇచ్చోడ, డిసెంబర్ 21: ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ప్రారంభించిన ఉచిత ఉచిత ప్రయాణంతో చాలా అనర్థాలు, నష్టాలున్నాయని, వెంటనే ఈ పథకాన్ని సవరించాలని గురువారం ధర్మ సమాజ్ పార్టీ నాయకులు తహసీల్దార్ తుకారాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సవరణ చేసిన తర్వాతే పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. మండల కార్యదర్శి గసికంటి లక్ష్మణ్, కోశాధికారి ప్రవీణ్, కిరణ్, బొప్పారపు రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను వివరిస్తున్న విద్యార్థులు

జిల్లాస్థాయి 'సృజన' టెక్నికల్ ఫెస్టివల్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 21:జిల్లాకేంద్రంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జిల్లాస్థాయి సృజన టెక్నికల్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సాంకేతిక ప్రదర్శనలో ఎలక్ట్రికల్, కంప్యూటర్, మెకానికల్ ఇంజినీరింగ్, డిప్లొమా విద్యార్థులు తమ ప్రాజెక్టులను వివరించారు. బెల్లంపల్లి, నిర్మల్, ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తమ ప్రాజెక్టు విశిష్టతను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. ఆదిలాబాద్ బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజినీర్ బీ విగ్నేశ్వర్, తలమడుగు టీఎస్ఎన్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ జీ సతీశ్ కుమార్, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాజెక్టులను ఎంపిక చేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కే వీరస్వామి, విభాగాల అధిపతులు రాజ్‌కుమార్, క్రాంతికుమార్, రాజన్న, సుజయ్, సురేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

● రూ. 7లక్షలకు పైగా ఆస్తి నష్టం

డోంగర్‌గామ్‌లో దగ్ధమైన ఇంటి సామగ్రి

గుడిహత్నూర్, డిసెంబర్ 21: మండలంలోని డోంగర్‌గామ్ గ్రామంలో దోమకొండ సుధాకర్ ఇల్లు గురువారం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఆయన ఇంటిలో ఉన్న ఫ్రిజ్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో కుటుంబ సభ్యులు బయటకు వచ్చారు. గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా, ఇల్లు, సామగ్రి పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ. 7 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. గుడిహత్నూర్ మాజీ సర్పంచ్ పవార్ రవీందర్ ఆర్థిక సహాయం కింద రూ.ఐదు వేలు అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మహిళా చట్టాలపై అవగహన

గుడిహత్నూర్, డిసెంబర్ 21: గుడిహత్నూర్ మండల కేంద్రంలోని చంద్రోదయ మండల సమాఖ్య అధ్వర్యంలో గురువారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. తమ హక్కులు, చట్టాలపై పూర్తి స్థాయిలో అవగహన ఉండాలని సూచించారు. ఆ